క్లుప్తంగా

## అధిక దిగుబడులు సాధించాలి



**ఆత్మకూర్:** రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్, సురేష్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారి వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికసిత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు మూలమళ్ల, పిన్నంచర్లలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వానాకాలం పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, పచ్చిరొట్టె ఎరువులను వాడకం గురించి వివరించారు.

## కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**గోపాల్‌పేట:** రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే ఫర్టిలైజర్ దుకాణాలను సీజ్ చేస్తామని మండల వ్యవసాయ అధికారిని కరుణశ్రీ హెచ్చరించారు. శుక్రవారం ఏదుల, గోపాల్‌పేట మండలాల్లోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏదుట్లలోని రెడ్డి ఫర్టిలైజర్, ఏదుల మండల కేంద్రంలోని ఎస్పీరెడ్డి, రైతు ఆగ్రోసేవా కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. డీలర్స్ అందరూ లైసెన్స్, విత్తన రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలని, ధరల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

## నేడు ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన

**కొల్లాపూర్:** ఎస్‌ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐఐటీ–జేఈఈ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా వెబ్‌కౌన్సిలింగ్‌పై అవగాహన కల్పించనున్నట్లు ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ పుట్టపాగ సంగెమయ్య వెల్లడించారు. 2025 ఐఐటీ–జేఈఈ ఎంట్రెన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు వారు తీసుకోబోయే కోర్సుల ద్వారా భవిష్యత్తులో లభించే ఉపాధి అవకాశాలు, ప్లేస్‌మెంట్స్, ర్యాంకుల ప్రకారం ఎక్కడ సీట్లు లభించొచ్చు, వాటి వివరాలు, వెబ్ కౌన్సిలింగ్‌లో పాల్గొనే విధానం వంటి విషయాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివరించనున్నారు. ఆసక్తి గల వారు సెల్ నంబర్: 78927 82387కు వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. బొంబాయి, వారణాసి, భోపాల్, దుర్గాపూర్, హైదరాబాద్ ఐఐటీ కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు సలహాలు, సూచనలు ఇస్తారని వివరించారు.

## శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

**కొల్లాపూర్ రూరల్:** జిల్లా స్థాయి కేవీపీఎస్ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు అశోక్ కోరారు. శుక్రవారం మండలంలో రామాపురంలో శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10, తేదీలలో పట్టణంలో సామాజిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, దళిత చట్టలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని రాజు, సంజీవ్, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అందరికి సమగ్ర వ్యాధి నిర్ధారణ ఆరోగ్య పరీక్షలు



**బిజినేపల్లి:** జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలోని అందరికి సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామని డీఎంహెచ్‌ఓ కేవీ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో 127 మందికి 7 రకాల వ్యాధుల నిర్ధారణకు సాధారణ పరీక్షలతో పాటు రక్తపరీక్షలు, మధుమేహం, రక్తపోటు వంటి వివిధ పరీక్షలను చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు అన్ని పీహెచ్‌సీల్లో 7 రకాల వ్యాధులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, వైద్యాధికారి డా.శివకుమార్, ఆరోగ్య విస్తీరణ అధికారి రమేష్‌కుమార్, సిబ్బంది నరసింహ, శివశంకర్, ఎల్‌ఎస్ రాజ్‌కుమార్, శ్రీను, అశోక్, ఆంజనేయులు శ్వేత, ఆశాలు, రోగులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంఖ్య పెంచండి

- ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య
- కలెక్టర్ ఆదర్శ్‌సురభి



జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి

**వనపర్తి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 6 నుంచి 19 వరకు కొనసాగుతుందని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో విద్య, వైద్య శాఖ, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో బడి బాట కార్యక్రమంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు సమన్వయంతో పనిచేసి ఇంటింటికీ తిరుగుతూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచాలని సూచించారు.

**9న గ్రామసభలు**

బడిబాటలో భాగంగా జూన్ 9న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. రెండు రోజుల ముందే పంచాయతీ కార్యదర్శి నోటీసు జారీ చేసి ప్రజలందరిని సభకు రప్పించాలని సూచించారు. ఈ సభలో బడిబాట కార్యక్రమంతో పాటుగా సీజనల్ వ్యాధులు, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 330 పాఠశాలలు ఉన్నాయని వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించి పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. జూన్ 12వ తేదీన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని అదే రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు స్కూల్ డ్రస్సులు అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జ్ యాదయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌గని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి, డీఆర్‌డీఓ పీడీ ఉమాదేవి, మండల విద్యాధికారులు, క్లస్టర్ హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

**పాన్‌గల్:** నాణ్యమైన విద్య కోసం ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని ఎంఈఓ శ్రీనివాసులు తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో బడి బాట కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు పాల్గొన్నారు.

**వనపర్తి రూరల్:** ప్రభుత్వ పాఠశాలలు ముద్దు.. ప్రైవేటు పాఠశాలలు వద్దని యాపర్ల జీహెచ్‌ఎం పేలుస శంకర్‌గౌడు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మియాపూర్‌లో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో స్వరాజ్యం, బాబురెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**వీపనగండ్ల:** ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రజాప్రతినిధులపై ఉందని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ అన్నారు. కల్వరాలలో, మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, భానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్ సాయిలత, అంగన్‌వాడీ టీచర్లు సుగుణబాయి, మహేశ్వరి, ఎల్లమ్మ, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అజ్జకొల్లులో..

**కొత్తకోట రూరల్:** పెద్దమందడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల మోజర్ల, మంగంపల్లి, పెద్దమందడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బడి బాట కార్యక్రమాన్ని తహసీల్దార్ సరస్వతి, సీనియర్ అసిస్టెంట్ ఎండీ గౌస్, ప్రధానోపాధ్యాయులు ఎస్.వరప్రసాద్ రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బడిబాట కరపత్రాలు విడుదల చేశారు.

**ఖిల్లాఘనపురం:** మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో తహసీల్దార్ సుగుణ, ఎంఈఓ జయశంకర్ ఆధ్వర్యంలో జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

**మదనాపురం:** మండలంలోని అజ్జకొల్లులో బడి బాట గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న బడి ఈడు కలిగిన 22 మంది చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో, ఐదో తరగతి పూర్తి చేసిన 26 మంది విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి షేక్ ఫారుక్ హుస్సేన్ తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రేమలత, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణగౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్‌లో..





పాన్‌గల్‌లో కరపత్రాల ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు , కల్వరాలలో మాట్లాడుతున్న నర్సింహ



మామిడిమాడలో..

## మొక్కల సంరక్షణతోనే మనుగడ



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శశిధర్

**అమరచింత:** మొక్కలను సంరక్షించడం ద్వారానే స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్ లభిస్తాయని అప్పుడే మానవ మనుగడతో పాటు జీవ వైవిద్యానికి ఎలాంటి హాని ఉండదని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం పట్టణంలో పచ్చదనంపై ర్యాలీ నిర్వహించి మొక్కల సంరక్షణతో కలిగే ప్రయోజనాలు వివరించారు. వర్షాలు కురుస్తుండటంతో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలని కోరారు.

## ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా శశిధర్



శశిధర్

**అమరచింత:** ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ అమరచింత ఇన్‌చార్జి కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు మున్సిపల్ సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం వంద రోజుల ప్రణాళికతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామన్నారు. ఏదైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న స్వరూప

**ఆత్మకూర్:** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ స్వరూప అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. అనాథ బాలల దత్తత, బాల్యవివాహాల నిషేధ చట్టం 2006, పోక్సో చట్టం 2012, బాలకార్మికుల నిషేధ చట్టం, దత్తత ప్రక్రియ, బాలరక్షక్ భవన్, అనాథల సేవలు, చైల్డ్‌హెల్ప్‌లైన్, టోల్‌ఫ్రీనంబర్ 1098, 181, 100 గురించి క్లుప్తంగా వివరించారు.

# కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



శేరుపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న, తహసీల్దార్ రాజు

**పాన్‌గల్:** భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్నారంలో 9, రాయినిపల్లిలో 6 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

**వనపర్తి రూరల్:** మండలంలోని చిమనగుంటపల్లిలో తహసీల్దార్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 53, దత్తాయిపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి ఆధ్వర్యంలో 48 దరఖాస్తులు స్వీకరించారు. పెబ్బేరు మండలంలోని బునాదిపూర్‌లో తహసీల్దార్ మురళీగౌడ్ 6, రామమ్మపేటలో డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ 5 దరఖాస్తులు తీసుకున్నారు. శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో తహసీల్దార్ రాజు 6 దరఖాస్తులు స్వీకరించారు.

**ఖిల్లాఘనపురం:** మండలంలోని మామిడిమాడ, పర్వతాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, సీనియర్ అసిస్టెంటు కురుమూర్తి, ఆర్‌ఐ తిరుపతయ్య పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

**ఆత్మకూర్:** మండలంలోని మేడేపల్లి, మోట్లంపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి 24 దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ షేక్ చాంద్‌పాషా, డీటీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రశేఖర్, సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరం



**వనపర్తి రూరల్:** పెబ్బేర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం, సాయి నేత్రాలయం వనపర్తి వారి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 100 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. కంటి పొరలు, చూపు మందగించడం, ఆపరేషన్, కంటి అద్దాల కోసం వనపర్తి సాయి నేత్రాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మహేష్, సభ్యులు శ్రీధర్, చరణ్, శ్రీనివాసులు, నవీన్, రామయ్య, శివ, నారాయణ, నాగరాజు, రాఘవేంద్ర, శివ రామయ్య. నిర్వాహకులు రామకృష్ణ, శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## నేడు బక్రీద్ పండుగ



**ఆత్మకూర్:** త్యాగాలకు ప్రతీకగా నిలిచే ఈద్ ఉల్ అదహా (బక్రీద్) పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం నిర్వహించే ఈదుల్ అద్ హా పండుగను పురస్కరించుకొని పట్టణం, మండలంలోని మసీదులు, ఈద్గాలను అందంగా ముస్తాబు చేశారు. పట్టణంలో ఏర్పాట్లను పుర కమిషనర్ శశిధర్ పర్యవేక్షించారు.

# కొనసాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు



రాజపేటలో పూజలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**పాన్‌గల్:** మండలంలోని గోప్లాపూర్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహాపూజ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు, రుద్ర పారాయణం, ఆవాహిత దేవతా పూజలు, రుద్రాభిషేకం, హోమాలు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ప్రత్యేక పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సురభి పుల్లారావు పాల్గొన్నారు.



గోప్లాపూర్‌లో హోమంలో పాల్గొన్న భక్తులు

రాజపేటలో..

**వనపర్తిరూరల్:** మండలంలోని రాజపేట రాజేశ్వర సహిత రాజేశ్వరస్వామి, వీరాంజనేయ స్వామి ఆలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే పండుగలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాణిక్యం, సుదర్శన్‌రెడ్డి, మాధవరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, చిట్యాల రాము, వెంకటేష్‌నాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మహాసభ వాల్‌పోస్టర్ విడుదల

**వనపర్తిటౌన్:** అమరచింత మండల కేంద్రంలో ఈ నెల 11న నిర్వహించే టీయూసీఐ వనపర్తి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు పి.అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహాసభ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో నాలుగు దశాబ్దాలుగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు, ధర్నాలు, సమ్మెలు చేసి కార్మిక వర్గానికి అండగా నిలబడ్డామన్నారు. కార్యక్రమంలో గణేష్, ఎదుట్ల కురుమయ్య, గోపాల్‌పేట్ కురుమయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

# అఖిలపక్ష కమిటీ నాయకులు అరెస్ట్

**అయిజ:** ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ జరిగిన సంఘటనలో అరెస్ట్ చేసి జైలుకు పంపించిన రైతుల కుటుంబసభ్యులను పరామర్శించేదుకు రాజోళి మండలం పెద్దధన్వాడ గ్రామానికి వెళ్తున్న అయిజ అఖిపక్ష కమిటీ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఉదయం 7 మంది నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వదిలి పెట్టారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యర్శి గోపాల్ యాదవ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ, బహుజన రాజ్యసమితి నాయకుడు వినోద్ కుమార్ ఉన్నారు.

**రైతులపై దాడి సరికాదు**

**ఉండవెల్లి:** పెద్దధన్వాడలో రైతులను పరామర్శించేందుకు వెళుతున్న అఖిలపక్షం నాయకులను అడ్డుకోవడం సరికాదని సీపీఎం నాయకుడు మద్దిలేటి అన్నారు. రైతులు తమ పొలాలను కాపాడుకునేందుకు పోరాటం చేస్తుంటే.. వారిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులందరికి న్యాయం చేయాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, మద్దిలేటి, నరసింహ, పాండు, శేషన్న పాల్గొన్నారు.



అయిజ పోలీస్‌స్టేషన్‌లో అఖిలపక్షం కమిటీ నాయకులు

# దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



ఖానాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శశిధర్

**మదనాపురం:** సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి కోరారు. శుక్రవారం వైద్యశాఖ అధికారులతో కలిసి దంతనూరు గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ జ్వర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా స్థానిక పీహెచ్‌సీల్లో వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. చౌకధర దుకాణాల్లో బియ్యం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ పరిమళ, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఆర్‌ఐ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**పాన్‌గల్:** పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలకు దూరంగా ఉండవచ్చునని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు.కేతేపల్లిలో వైద్య సిబ్బందితో డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామయ్య, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పరశురాం పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్:** పట్టణంలోని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఇంటింటికీ తిరుగుతూ తడి, పొడి వ్యర్థాల మూల విభజన, పెంపుడు కుక్కలు, డెంగ్యూ, మలేరియా జ్వరాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.



జిల్లా కేంద్రంలో కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు



కేతేపల్లిలో..

కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూర్:** మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో కమిషనర్ చికినే శశిధర్ ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రుణాల చెల్లింపుతోనే ఆర్థిక వృద్ధి

**బిజినేపల్లి:** రుణాల చెల్లింపుతోనే ఆర్థిక వృద్ధి సాధ్యమని డీఆర్‌డీవో చిన్న ఓబులేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలెంలో శ్రీనిధి రుణాల మొండి బకాయిదారులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తే తద్వారా ఆ సంఘం మరింత ఎక్కువ మొత్తంలో రుణం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీకి అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి రీజినల్ మేనేజర్ మహేంద్రకుమార్, మేనేజర్ విక్రమ్‌కుమార్, సీసీ రామస్వామి, వీఓఏలు, పలు సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్